కథానిక

# శృంగార సైనికము

నెమలికంటి రామచంద్రరావు

రాజస్థానంమీద కంఫిణీవారి సైనిక చర్య పూర్తయింది. కంఫిణీ సైనికులు జట్లు జట్లుగా విడిపోయి, గ్రామాల వెంబడి పడి పిండారీలను గాలిస్తున్నారు. ఒక జట్టు నాయకుడు తన పాతికమంది అనుచరులతో బయలుదేరాడు. ఆరాత్రి వాళ్ళు భద్రంగా విడిసేటందుకుచోటు వెతుక్కోవలసివచ్చింది. వాళ్ళలో ఒకడు-చోదకుడు-ముందుగాపోయి, చీకటిపడపోతూండగా తిరిగి వచ్చాడు. "అంతా బాగుంది. నే నొక గ్రామం చూశాను. అక్కడ యీ రాత్రికి మనం విశ్రాంతి తీసుకుని హాయిగా వుండవచ్చును." అన్నా డతను. నాయకుడు తన జట్టును ముందుకు నడవడానికి అజ్ఞయిచ్చాడు. చీకటి పడిపోయింది. ఆ దళమంతా ఒక పెద్ద వీథిలోకి ప్రవేశించారు. ఆ కటికె చీకటిలో కూడా పిండారీలు ధ్వంసం కావించిన యిళ్ళు, మొండిగోడలు కనిపిస్తున్నాయి. అక్కడక్కడ మాత్రం ఏ కిటికీలోనుంచో కొద్ది వెలుతురు బయటకు వస్తోంది. ఏ సంసారులో ధైర్యంతో గాని, అవసరం వల్లగాని తమ శిథిల గృహాలను రక్షించుకొనడానికి వుండివుంటారు. పిండారీల భయంతో గ్రామాలకు గ్రామాలు ఖాళీచేసి వెళ్ళిన వాళ్ళు యింకా తిరిగి రాలేదు.

వాళ్ళు ఎక్కిన గుర్రాలు ఆ చీకటిలో నడవటానికి తడబడుతున్నాయి. మంచు కురవడం ప్రారంభించింది. మొదటగా ఆ వూరు చూచి వచ్చినవాడు, తన గుఱ్ఱపు కళ్లెం పుచ్చుకుని, ముందు నడుస్తున్నాడు. "మమ్మల్ని ఎక్కడకు తీసుకు వెడుతున్నావు?" అని నాయకుడు అడిగాడు. అతను జవాబుగా, "నేను మంచి యిల్లొకటి చూసి వచ్చాను" అన్నాడు. కొద్దిగజాలు నడవగానే, అత డొక మండువా వాకిలిముందు ఆగాడు. దారికి కుడి పక్కగా వుంది. చుట్టూ చెట్లు వున్నాయి. ప్రహారీ గోడపక్కన పెద్ద రాయి తీసుకుని, దర్వాజా తాళం పగులగొట్టి, వెలిగించిన కరదీపిక వెలుతురులో వాళ్ళని సావిడిలోకి తీసుకు వెళ్ళాడు—— ఆయిల్లు భాగ్యవంతులది కాబోలు; చాలా విశాలంగా వుంది. అతనుఎన్నిరోజులనుంచో ఆయింట్లో నివసిస్తున్నవాని మాదిరి, అందరనూ లోపలికి తీసుకువెళ్ళాడు.

గుర్రాలను జాగ్రత్తగా చూడటానికి యిద్దరు మనుష్యులు కాపలా వుంచబడ్డారు. పదిమంది వూరుకు నలువైపులా కాపలాలకు పంపివేయబడ్డారు. సగం రాత్రి తరువాత మిగిలిన పదిమందీ వెళ్ళి, మొదటివాళ్ళకు విశ్రాంతి యిస్తారు. నలుగురు వంట చేయడానికి నియమింపబడ్డారు. వాళ్ళను అక్కడకు తీసుకువచ్చినవాడు, ఇంట్లో ఏవైనా వంటసామాను లున్నాయేమో వెతకడానికి వెళ్ళాడు. నాయకుడు స్వయంగా వెళ్ళి, కాపలా ఎక్కడెక్కడ వుంచాలో చూసి, సైనికుల్ని నియమితస్థానాలలో వుంచి వచ్చాడు. అరగంటలో నాయకుడు తిరిగి వచ్చేటప్పటికి, సావిట్లో పెద్దవాలుడు కుర్చీమీద-అంతా చెక్కతోనే చేయబడింది-చోదకుడు, విశ్రాంతిగా కాళ్లు కుర్చీ చేతులమీద జారవేసి కూర్చుని, చుట్ట కాల్చుకుంటున్నాడు. నాయకునికి తాను బాగా స్నేహితుడు కూడా కావటంవలన, అతనిరాక చూచి లేవకుండానే అలాగే నిమీలిత నేత్రాలతో విశ్రాంతి తీసుకుంటున్నాడు. చుట్టపొగ వాసనతో ఆ గది అంతా నిండిపోయింది. పక్క గదిలోనుంచి వంటచేస్తున్న చప్పుడు నాయకునికి వినిపించింది. నాయకుడు దగ్గరకు వచ్చి, పక్కనే ఉన్న పెద్దపట్టెమంచంమీద చతికిలపడ్డాడు. చోదకుడు నవ్వుతూ-"చాలా బాగుంది. ఈ ఇంట్లో మనకు కావలసినవన్నీ వున్నాయి. దొడ్లో కాయగూరలు విపరీతంగా వున్నాయి. అంతా

బాగానే వున్నది. అరగంటలో వంట తయారవుతుంది" అన్నాడు.

"అరే! నీ కివన్నీ ఎక్కడ దొరికాయోయ్?" అన్నాడు నాయకుడు.

"ఎక్కడేమిటి! ఈ యింట్లోనే-బలే యిల్లు. మరి యిటువంటి ఇల్లు కనుక్కొనేందుకు ఎటువంటి తెలివి వుండాలి!" అతను నవ్వాడు. నాయకునికికూడా నవ్వు వచ్చింది.

"ఈ వూరంతా పండుగలాగ వుంది. కాని ఒకటి తక్కువ" అని అతను సణిగాడు.

"ఏమిటది?" అని నాయకుడు ప్రశ్నించాడు.

"బహుశా ఈ వూళ్లో దొరకవచ్చు లే" అన్నా డతను.

"ఏమిటో చెప్పవోయ్-" అన్నాడు నాయకుడు.

"ఆడవాళ్లు."

"ఆడవాళ్లా! నీకు పిచ్చి ఎత్తలేదు కదా-" అన్నాడు నాయకుడు.

"కాదు, ఇటువంటి సంతోష సమయంలో స్త్రీలు లేకుండా ఎలా? నువ్వు కాస్త తలుచుకుంటే అదెంతపని?" అన్నాడు చోదకుడు.

"ఏంరా-నా వుద్యోగం పోగొట్ట తలచుకున్నావా ఏమిటి? ఐనా యీ పల్లెటూళ్ళో ఆడవాళ్లు యెక్కడ దొరుకుతారు?" అన్నాడు నాయకుడు, అతని ముఖం చూస్తూ.

"ఎక్కడపడితే అక్కడే. కనీసం యిద్దరు ముగ్గురన్నా దొరక్కపోరు. ఊళ్లోకి వెళ్ళి చూడవోయ్" అన్నా డతను.

"అరె! నాకీ వూరు పూర్తిగా కొత్తదికదా! అదీ కాకుండా చూడరా—మనం కుంఫిణీ వారి సైనికులం కదా! సైన్యానికి అప్రతిష్ఠ తెస్తే ఎలా?" అన్నాడు నాయకుడు. నాయకుని సరిగా విననట్లు నటిస్తూ చోదకుడన్నాడు: "నేను నీకు దారి చెబుతాను, వెళ్ళు." నాయకుడు అతనివంక చూశాడు.

"ముందు పటేలు దగ్గరకు వెళ్లు" అన్నాడు చోదకుడు.

"పటేలా!—ఎందుకు ?"

"అరె! ఎందు కేమిటి? ముందు అతన్ని పిలు-పిలిచి ఎవరినన్నా స్త్రీలను తీసుకరమ్మని చెప్పు."

"పటేలు!...స్త్రీ..." నాయకుడు విరగబడి నవ్వాడు.

"నేను పరిహాసంగా మాట్లాడ లేదు. ముందుగా వెళ్ళి పటేలును చూడు. అతనితో సరదాగా మాట్లాడు కాసేపు- ఇది కుంఫిణీ రాజ్యం, గుర్తుంచుకో! అతనితో చెప్పు...వాళ్ళ కిటువంటివి బాగా తెలుసులే" అన్నా డతను.

"నువ్వసలు ఏమనుకుంటున్నావురా ?" అన్నాడు నాయకుడు.

"అరే బాబూ! నేను చెప్పినట్లు మాట్లాడకుండా చెయ్యి. అంతా చక్కగా జరుగుతుంది. అంతమాత్రం నువ్వు పటేలుతో మాట్లాడలేవా?"

"వీలు లేదు- లాభం లేదు." అన్నాడు నాయకుడు. అతను మంచానికి దగ్గరగా కుర్చీ లాక్కున్నాడు. బహుశా నాయకుని బలహీనత అతనికి తెలిసి వుండవచ్చును.

"అరె లేవరా- నువ్వు నాయకుడివి కాబట్టి, యీ వూరి పెద్దను నువ్వే వెళ్లి కలియాలి. లేకపోతే నేనే వెళ్లేవాడిని." అన్నా డతను.

"నాకు పటేలు యిల్లు యీ చీకట్లో ఎక్కడ తెలుస్తుంది?" అన్నాడు నాయకుడు, మెత్తబడుతూ.

"నేను చెబుతానుగా- సరాసరి వెడుతుంటే, ఎడమవైపున సందు వున్నది. ఆ సందు చివర పెద్ద ప్రహరీ యిల్లు వుంది. అదే పటేలు యిల్లు." అన్నా డా చోదకుడు. నాయకుడు లేచి వెడుతూండగా, చోదకుడు వెనుకకు పిలిచి, "పటేలుతో మంచి విందు అని చెప్పు" అన్నాడు.

పటేలు యిల్లు కనుక్కోవడానికి అంత కష్టం కాలేదు. నాయకుడు వెళ్లి తలుపు కొట్టాడు. పది నిమిషాల తరువాత లోపలనుండి, "ఎవరు?" అని బొంగురు గొంతుక వినవచ్చింది. నాయకుడు జవా బిచ్చాడు. గడియ విడి, తలుపులు తెరుచుకున్నాయి. చాలా భారీమనిషి; కోర మీసాలు, పెద్ద బొజ్జ;— ఆ మనిషి దర్వాజా నిండుగా నాయకుని ఎదుట నిలవబడ్డాడు. నాయకుడు మిలిటరీ శాల్యూట్ చేశాడు. ఇతనిని చూచి, అతడు గాభరా పడ్డాడు. కొంచెం చెమట పట్టినట్లు కూడా వుంది. తిరిగి నమస్కారం చేస్తూ, నాయకుని లోపలకు తీసుకు వెళ్లి, బల్లమీద కూర్చోబెట్టాడు. "ఏమండీ!

నాతో మీకేమిటి పని?" అతని స్వరం కొంచెం తడబడుతున్నట్లుంది. నాయకుడు తామెంత మంది వచ్చింది, తామెందుకు వచ్చింది, ఎక్కడ దిగింది అంతా వివరంగా చెప్పాడు. "ఈ వూళ్లో మేము మీ సహాయం లేకుండా వుండటం కష్టం. మా విందుకు మిమ్మల్ని - ఆహ్వానిస్తున్నాం" అన్నాడతను నాయకుడు.

పటేలు కొంచెం స్తిమిత పడ్డాడు. నవ్వుతూ "అయినా, బాబూ! ఇది విందుకు సమయం కాదేమో!" అన్నాడు.

"చూడండి. ఇది యుద్ధం - మేము రేపు బ్రతుకుతామో, చచ్చిపోతామో తెలియదు. అందువలన ప్రతిక్షణం, మేము సంతోషంగా కాలం గడపా లనుకుంటాం. తప్పు కాదు గదా?" అని అంటూ, పైమీద వున్న వుత్తరీయంతో, తన శరీరం మీద పట్టిన చెమట తుడుచుకుంటూ, నాయకుడు, "ఈ వూళ్లో మేమింకా పిలవవలసిన వారెవ్వరైనా వున్నారా?- చెప్పండి" అని అడిగాడు.

"ఇంకానా...ఎవరూ లేరేమో!" అన్నాడతను చూరువంక చూస్తూ.

"ఆలోచించండి — మీరేమీ అనుకోకుండా వుంటే...ఆడవాళ్ళుకూడా వుంటే మంచిది. చూడండీ - స్త్రీలు లేకపోతే అందమే వుండదు" అన్నాడు నాయకుడు. ఒకసారి పటేలు నాయకుని వంక చూశాడు. "ఆడవాళ్ళా! ఎవరూ లేరే- ఈ గోలతో అందరూ వూరునుంచి పారిపోయారే" అన్నాడు.

"ఎవరూ లేరా!" నాయకుడు బిగ్గరగా నవ్వి, "అరే, ఒకరన్నా లేకుండా ఎలా? బాగా ఆలోచించండి. ఇంతవూరు మీద ఒకరన్నా లేరా?" అన్నాడు.

"లేరండీ! అందరూ వెళ్ళిపోయారు. మగవాళ్ళు మాత్రం అక్కడక్కడా కొద్దిమంది వీలు లేక పడి వున్నారు" అన్నాడు పటేలు.

"ఇంకా బాగా ఆలోచించండి. ఈ వూళ్ళో మీకు తెలియనివారంటూ ఎవ్వరూ వుండరు కదా!" అన్నాడు నాయకుడు. పటేలు నిశ్శబ్దంగా ఇంటి కప్పు వంక చూసి బిగ్గరగా నవ్వుతూ, నాయకుని వంక పక్కచూపులు చూస్తూ, 'ఆఁ! జ్ఞాపకం వచ్చింది. ఉన్నారు, ఉన్నారు" అన్నాడు. నాయకుడు మంచి హుషారుతో ఒక్కసారి సరిగా కూర్చుని అన్నాడు, "నేను చెప్ప లేదండీ - మీరు కొంచెం ఆలోచిస్తే చాలని-"

"అవునవును. జ్ఞాపకానికి వచ్చారు. నలుగురు ఆడవాళ్ళున్నారు." అన్నాడు పటేలు నాయకునివంక పక్క చూపులు చూస్తూ. నాయకుడు హుషారుగా పటేలు చెయ్యి తట్టుతూ, "పటేలుగారూ! మీరు మంచి సమర్థులు. నలుగురు స్త్రీలా! భేష్" అని తాము దిగిన ఇల్లు చెప్పాడు. పటేలు కులాసాగా నవ్వుతూ "మంచిది, మంచిది. ఒక్క అరగంటలో వాళ్ళను నేను తీసుకుని వస్తాను" అన్నాడు, నాయకుని వీధిలోకి సాగనంపుతూ.

నాయకుడు రావటం చూచి ఆ చోదకుడు, "ఏమైంది? ఏమైంది?" అని అడిగాడు ఆదుర్దాగా. నాయకుడు జరిగిన దంతా చెప్పాడు. "నలుగురు ఆడవాళ్లా! చూశావా నా ప్లాన్!" అన్నాడతను గంతులు వేస్తూ. నాయకుడు కూడా సంతోషపడ్డాడు. చోదకుడు గబగబా తలుపులన్నీ బార్లాతీశాడు. నాయకుడు వచ్చేటప్పటికే అంతా సిద్ధమై వుంది. పక్కగదిలోంచి పప్పు పులుసు కాగుతున్న వాసన వచ్చి, సావిడంతా నిండిపోయింది. పనివాళ్ళు గబగబా తమ తమ పనులు పూర్తిచేసివేస్తున్నారు— వాకిట్లో అడుగుల చప్పుడు విని, చోదకుడు ఒక్కసారి ఎగిరి గంతువేశాడు. నాయకుడు లేచి నిలబడ్డాడు. పటేలు లోపలికి వస్తూ నాయకునికి, చోదకునికి నమస్కారం చేశాడు. వారు ప్రతి నమస్కారం చేశారు. పటేలు వచ్చి లోపల కూర్చున్నాడు. వీరికి ఆదుర్దాగా వుంది— పటేలు అది గమనించి, "వారు కూడా వస్తున్నారు" అన్నాడు. చోదకుని ముఖం విప్పారడం నాయకుడు గమనించాడు. చోదకుడు గదిలోని దీపం పెద్దది చేశాడు. ఇంతలో ఒక ఏబది సంవత్సరాల స్త్రీ లోపలకు ప్రవేశించి, అందరికీ నమస్కారం చేసింది. ఆమెను వారు తేరిపార చూస్తుండగా, వాకిట్లో మెట్ల మీద కర్రల చప్పుడు వినిపించింది. అందరూ అటు గుమ్మంవైపు చూచారు. ముగ్గురు స్త్రీలు- ఇరువైపులా కర్రల ఆధారంతో లోపలకు ప్రవే

శిస్తున్నారు. ముసలివాళ్ళు. పిండారీల దౌర్జన్యాలకు గురియైనవాళ్లు కావచ్చును. మొదట వచ్చిన స్త్రీ అన్నది: "బాబూ! కుంఫిణీరాజ్యం అంటే ఏమిటో అర్థమైంది. పూర్వం సైనికుల్ని చూస్తే పై ప్రాణాలు పైనే పోయేవి. ఇప్పుడు వాళ్లే గ్రామస్థుల్ని విందులకు కూడా పిలవడం ఎంత అదృష్టం! మమ్మల్ని మీరు జ్ఞాపకం వుంచుకున్నందుకు ఎంతో సంతోషం."

వెనుకవచ్చిన వృద్ధ స్త్రీలు, వికలాంగులు నెమ్మదిగా మంచంమీద కూర్చున్నారు. వాళ్ళ ముఖాలు సంతోషంగా వున్నాయి. బహుశా చాలారోజుల తరువాత వాళ్ళకిభోజనం తృప్తిగా దొరికే ఆశ కలిగింది యీరోజేనేమో! పటేలు ఓరగా చూచి, తన ఘనకార్యానికి వికటంగా నవ్వుతున్నాడు. నాయకునికికూడా నవ్వు వచ్చింది. తన మర్యాద దక్కినందుకు సంతోషపడినట్లు, అతని ముఖంలో కనిపిస్తోంది. చోదకుని ముఖంతారు పూసిన ట్లువడం ఆ కరదీపికల వెలుతురులో విస్పష్టంగా కనిపించింది.

పక్క గదిలో నుంచి పప్పు పులుసు తిరగ పోత ఘుమ ఘుమాయింపు వచ్చి యిల్లంతా చుట్టుకుంది.

# ప్రేమలాంఛనం

జి. యస్. యస్. ప్రసాద్

శారద తలుపు తెరచి నవ్వుతూవున్న రమేశ్‌ను చూచింది. శారద కాశ్చర్యం కల్గింది-రమేశ్ యిక్కడి కెలా వచ్చాడా అని. శారద అంది: "చాలా విచిత్రపు మనిషివి రమేశ్."

"నీకు ఒక సంతోష వార్త వినిపించుదామని వచ్చా. ఏమన్నా బహుమతీ యిస్తే చెప్తాను."

"అదేం కుదరదు. వినిపించితే వినిపించు. బహుమతులు శూన్యం."

"అయితే బహుమతి కూడా నేనే యివ్వాలన్నమాట. ముందు విషయం చెపుతా, తర్వాత బహుమతీ యిస్తా."

"ఆరు మాసముల క్రిందట నన్ను 'సిమెంట్ వర్క్స్'లో తీసుకున్నారు. ఆ తర్వాత నా పనికి సంతసించి యజమానులు వాటా యిచ్చారు. తర్వాత మా కంపెనీకి చాలా లాభం వచ్చింది. ఈ తక్కువ కాలంలోనే బాగా ధరలు పెరిగాయి. నేడు వాటిని 40 వేల కమ్మాను."

"నువ్వు చాలా అదృష్టవంతుడివి రమేశ్. మా..."

"శారదా! ధైర్యం వహించు. నీ అదృష్టం మంచిదే. ఆ బల్లమీ దేముందో చూడు."

శారద ఒక కాగితంతో ప్యాక్ చేసిన దాన్ని రమేశ్ కిచ్చింది. రమేశ్ తెరచాడు. మంచిగంధపు చెక్కతో చేయబడిన పెట్టెను తీశాడు. శారద ఆత్రుతతో "అందులో ఏముంది?" అని అడిగింది.

"నువ్వే చూడు" అంటూ శారద కిచ్చాడు. పెట్టెలో వజ్ర మిమిడ్చిన ఉంగర ముంది. ఉత్సాహంతో "యిది నాకేనా" అంది శారద.

"అవును. నీకే. నీకంటె యింకెవరు నాకు ఎక్కువప్రియమైనవాళ్లు!"

"పురుషుల ప్రేమకు అంతేమిటి? స్త్రీలు వాళ్ల ఆటబొమ్మలు" అంటూ నవ్వింది శారద.

"నువ్వు చెప్పింది నిజమే కావచ్చు. కాని వేళ్లన్నీ ఒకేవిధంగా వుండవుకదా!"

శారద వేలికి వుంగరం పెడుతూ "నీకు నచ్చిందా" అన్నాడు.